## వెబ్ కాస్టింగ్‌తో పోలింగ్ పరిశీలన

ఎన్నికల నిర్వహణ అధికారి భాస్కరరెడ్డి



భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గంలో సోమవారం నిర్వహించే పోలింగ్‌కు పక్కాగా ఏర్పాట్లు చేశామని ఎన్నికల నిర్వహణ అధికారి ఎస్.భాస్కరరెడ్డి సాక్షికి శనివారం తెలిపారు. నియోజకవర్గంలో 3,63,013 మంది ఓటర్లుండగా వారిలో స్త్రీలు 1,84,908 మంది, పురుషులు 1,78,090 మంది, ఇతరులు 15 మంది వున్నారని తెలిపారు. మొత్తం 359 పోలింగ్ కేంద్రాల్లో 86 సమస్యాత్మకమైనవిగా గుర్తించి ప్రత్యేక బందోబస్తుతోపాటు తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నామన్నారు. 1200లకు పైగా ఓటర్లున్న కేంద్రాలు 220 ఉన్నాయని, ఈ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ ద్వారా పోలింగ్ పర్యవేక్షిస్తామని తెలిపారు. పోలింగ్ ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందని, సాయంత్రం 6 గంటల వరకు లైన్‌లో వున్నవారిని ఓట్లు వేసేందుకు అనుమతిస్తామని తెలిపారు. నియోజకవర్గంలో మొత్తం 2,565 మంది సిబ్బంది విధుల్లో వుంటారని పేర్కొన్నారు. పోలింగ్ కోసం వినియోగించే ఎలాక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎం) అన్నీ పరిశీలించామన్నారు. ఎమ్మెల్యే అభ్యర్థులు 17 మంది ఉండడంతో ఒక ఈవీఎంను వినియోగిస్తున్నామని, ఎంపీ అభ్యర్థులు 33 మంది ఉండడంతో మూడు ఈవీఎంలు వినియోగిస్తున్నట్టు తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లకు ఇబ్బందులు లేకుండా అవసరమైన ఏర్పాట్లు చేసినట్టు తెలిపారు. ప్రలోభాలకు లోను కాకుండా తమకు ఇష్టమైన అభ్యర్థులకు అందరూ ఓటు వేసుకోవాలని ఆయన కోరారు.

## 'గంటా'ది తప్పుడు మేనిఫెస్టో

తగరపువలస : తప్పుడు మేనిఫెస్టోతో గంటా శ్రీనివాసరావు భీమిలి ప్రజలను ఏమార్చలేరని వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి అన్నారు. శనివారం జీరుపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ అబద్ధాల పుట్ట గంటా మేనిఫెస్టోలో ఒక్క నిజం కూడా లేదన్నారు. ఐదేళ్లు భీమిలి ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసి కూడా చిట్టివలస జ్యూట్‌మిల్లు సమస్య పరిష్కరించకపోగా కార్మిక సంఘాల నాయకులను అవమానించారన్నారు. ముత్తంశెట్టి శ్రీనివాసరావు 2019లో గెలిచిన మూడు నెలల్లోనే సమస్య పరిష్కరించి కార్మికులకు రూ.34 కోట్ల బకాయిలు ఇప్పించారన్నారు. భీమిలి ఇన్‌చార్జి శిల్లా సరళారాణి, కరుణాకరెడ్డి మాట్లాడుతూ చిల్లపేట చెరువు బ్యూటిఫికేషన్ కాంట్రాక్టర్ గంటా దెబ్బకు పారిపోయాడన్నారు. రియల్ ఎస్టేట్ బ్రోకర్లను అడ్డం పెట్టుకుని ముత్తంశెట్టి శ్రీనివాసరావుపై గెలవాలనుకోవడం గంటా అవివేకానికి నిదర్శనమన్నారు. నాయకులు చిల్ల బాబయ్యరెడ్డి, పీతల వెంకట అప్పారావు, చిల్ల ప్రమీల, నమ్మి మాదవ, చేట్ల ఎల్లయ్యరెడ్డి, బొండా కిరణ్, నమ్మి లక్ష్మణ, చిల్ల గణేష్ రెడ్డి, వంశీరెడ్డి, జగన్నాథ ఎల్లాజీ, జీరు చినరమణ పాల్గొన్నారు.

# ఫ్యాన్ హోరు.. సైకిల్ బేజారు

- ప్రచారంలో దూసుకుపోయిన ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు
- సీఎం జగన్ ప్రభుత్వ పథకాలు, అభివృద్ధితో మరింత ఊపు
- ప్రతీ గడపకూ వెళ్లి ఓట్లు అభ్యర్థించిన వైఎస్సార్‌సీపీ శ్రేణులు
- నామమాత్రంగా రోడ్ షోలతో సరిపెట్టేసిన 'గంటా'
- హడావుడి మినహా క్షేత్ర స్థాయిలో టీడీపీ ప్రచారం శూన్యం
- భూ ఆక్రమణలు, ప్రజా వ్యతిరేకతతో 'గంటా' ఎదురీత



ముత్తంశెట్టి శ్రీనివాసరావు

తగరపువలస : ఈ నెల 13న జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో మరో మారు ముత్తంశెట్టి శ్రీనివాసరావు భీమిలి పీఠంపై వైఎస్సార్‌సీపీ జెండాను రెపరెపలాడించబోతున్నారు. రాష్ట్రంలోనే అతి పెద్దదైన ఈ నియోజకవర్గంలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఎన్నికల ప్రచారంలోనే కాకుండా 'గడప గడపకు మన ప్రభుత్వం' పేరుతో నిర్వహించిన కార్యక్రమంలోనూ ప్రతీ గడపను సందర్శించారు. ప్రజల బాగోగులు అడిగి తెలుసుకుని క్షేత్రస్థాయిలో సమస్యలు పరిష్కరించారు. నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోని ప్రజలనూ పేరు పెట్టి పిలిచేంతగా చేరువయ్యారు. దీనికితోడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో ప్రతీ గ్రామంలో సచివాలయం, వలంటీర్ వ్యవస్థ ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించింది. గతంలో ఏ ప్రభుత్వమూ చేయనన్ని అభివృద్ధి పనులు చేసింది. ముఖ్యంగా ప్రతీ నెల ఇంటికే అందిస్తున్న రూ.3 వేల వైఎస్సార్ పింఛన్ కానుక, ఇంటింటికీ రేషన్, ఆరోగ్యశ్రీ పరిమితి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పెంపు, 'నాడు – నేడు' ద్వారా పాఠశాలలు, ఆస్పత్రులను కార్పొరేట్‌కు దీటుగా ఆధునికీకరించడం, జగనన్న ఆరోగ్య సురక్ష, చేదోడు, చేయూత, బీసీ నేస్తం, కాపు నేస్తం, వైఎస్సార్ బీమా, రైతు భరోసా, తోడు, వాహన నేస్తం, ఇళ్ల పట్టాల పంపిణీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా వసతి దీవెన వంటి పథకాలతో నియోజకవర్గంలోని 1,15,000 కుటుంబాలు లబ్ధి పొందాయి. వీరిలో కనీసం రూ.లక్ష నుంచి రూ.8 లక్షల వరకూ లబ్ధి పొందిన వారు ఉన్నారు. ముఖ్యంగా పార్టీలకు అతీతంగా విపక్షాలకు చెందిన వారు కూడా వైఎస్సార్‌సీపీ సంక్షేమ పథకాలు అందుకోవడంతో సీఎం జగన్ పట్ల విశ్వాసం పెంచుకున్నారు. ఇది ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు కలిసి వచ్చే అంశం. ఓటర్లలో మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, యువత సైలెంట్‌గా ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయనుండడంతో ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఖాయమనే చర్చ జోరుగా సాగుతోంది.

### వలసలపైనే 'గంటా' ఆధారం



కుక్కతోక పట్టుకుని గోదావరి ఈదినట్టుంది భీమిలిలో గంటా శ్రీనివాసరావు పరిస్థితి. 2014 నుంచి 2019 మధ్యలో భీమిలి ఎమ్మెల్యేగా పనిచేసినా ఎవరికీ అందుబాటులో ఉండకపోవడం... హుద్‌హుద్, కరోనా వంటి కష్టకాలంలో కూడా ఇక్కడి ప్రజలను ఆయన కనీసం పరామర్శించలేదు. ముఖ్యంగా అప్పట్లో పాల్పడిన భూ కబ్జాలు, దందాలు వింటే నియోజకవర్గ ప్రజలు హడలిపోతున్నారు. దీనికితోడు ఐదేళ్లు నియోజకవర్గ ప్రజలకు దూరంగా వుండడంతో మళ్లీ వారిని కలిసే సాహసం చేయలేక ప్రస్తుతం రోడ్ షోలతోనే ప్రచారం సరిపెట్టేశారు. దీంతో ఓటర్లను కాకుండా వలస నాయకులు, రియల్ ఎస్టేట్ బ్రోకర్లను చేరదీసి ఇదే బలమని నమ్మించేందుకు గంటా ప్రయత్నించారు. కొంత మందికి బలవంతంగా కండువాలు వేశారు. గతంలో అతని పంచన ఉన్న వారే తప్ప ఓటర్లు టీడీపీ వైపు వెళ్లకపోవడంతో ఆ పార్టీ వారికి మింగుడు పడటం లేదు. భీమిలి టికెట్ ఆశించిన టీడీపీ, జనసేన ఇన్‌చార్జులు కోరాడ రాజబాబు, పంచకర్ల సందీప్ ఏ క్షణంలో అయినా గంటాకు హ్యాండ్ ఇవ్వొచ్చన్న భయం వెంటాడుతోంది. దీంతో లేని చిరునవ్వును ముఖంపై పులముకున్నా క్షేత్రస్థాయిలో టీడీపీ కార్యకర్తలు కూడా పనిచేయడం లేదు. గంటా ఒకవేళ గెలిచినా తన ఇంటి, ఆఫీసు మెట్లు కూడా తొక్కనివ్వరని వెనక్కు తగ్గుతున్నారు. గతంలో 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు హామీలను తుంగలో తొక్కినట్టుగానే... ఇప్పుడు ఇస్తున్న అమలు చేయలేని హామీలను ప్రజలంతా నమ్మమంటున్నారు. డబ్బులతో ఓట్లను కొనాలని చూస్తున్నా వాళ్లు కూడా ఓట్లు వేయరన్న ఆందోళన 'గంటా'ను వెంటాడుతోంది. మొత్తంగా గంటా తొలిసారి ఓటమి రుచి చూస్తారని నియోజకవర్గ ప్రజలు చర్చించుకుంటున్నారు.

# అందుబాటులో వుండే వారినే ఎన్నుకోండి

- నియోజకవర్గంలో భారీ బైక్ ర్యాలీలో ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

భీమునిపట్నం : గడిచిన ఐదేళ్లలో ఎవరి వల్ల మేలు జరిగింది, ఎవరు అందుబాటులో వున్నారో ఆలోచించి ఓటు వేయాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కోరారు. శనివారం సాయంత్రం భీమిలిలోని క్యాంపు కార్యాలయం నుంచి పెద్దబజారు, మెయిన్ రోడ్డు, చిన్నబజారు మీదుగా తగరపువలస వరకు వైఎస్సార్‌సీపీ నాయకులు, అభిమానులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ఐదేళ్లలో అన్ని వర్గాల ప్రజలకూ మేలు చేశారని తెలిపారు. అందుకే తాము చేసిన మంచిని చూసి ఓటు వేయాలని గుండె ధైర్యంతో అడుగుతున్నామన్నారు. చెప్పుకోవడానికి ఏమీ లేక చంద్రబాబునాయుడు అనర్గళంగా అబ్బద్ధాలు చెబుతున్నాడని మండిపడ్డారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మోసకారి బాబును నమ్మితే తీవ్రంగా నష్టపోతారన్నారు. సంక్షేమ పాలన కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని కోరారు. టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు ఎవరికీ అందుబాటులో వుండరన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో వుండే తనను, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని కోరారు. కార్పొరేటర్ ముత్తంశెట్టి ప్రియాంక, అల్లిపిల్లి నర్సింగరావు, మైలిపల్లి షణ్ముఖరావు, కదిరి ఎల్లాజీ, వాసుపల్లి కొండబాబు, ఎస్.కరుణాకరరెడ్డి పాల్గొన్నారు.

### విజయోత్సవానికి సిద్ధం కండి

కొమ్మాది : జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు విడుదల కానున్నాయని, వైఎస్సార్‌సీపీ శేణులు ఆ రోజు విజయోత్సవానికి సిద్ధం కావాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. జీవీఎంసీ 8వ వార్డు సాగర్‌నగర్, ఎండాడ, రుషికొండ, మిథిలాపురి వుడా కాలనీ మీదుగా శనివారం నిర్వహించిన భారీ బైక్ ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో ఏ గడపకు వెళ్లినా అపూర్వ స్వాగతం లభించిందన్నారు. గత ఐదేళ్లలో సీఎం జగన్ అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధి తనను గెలిపిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి భీమిలి నుంచి భారీ మెజారిటీ బహుమతిగా అందిస్తామని తెలిపారు. టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు ఎన్ని ప్రలోభాలు పెట్టినా, మోసపూరిత హామీలు ఇచ్చినా ప్రజలు నమ్మడం లేదన్నారు. ఓటు వేసేందుకు స్కూల్‌కు వెళ్లేవారంతా... గతంలో ఆ స్కూల్ ఎలా వుంది... ప్రస్తుతం ఎలా వుందో ఒక్కసారి చూసి ఓటేయాలని కోరారు. కార్పొరేటర్ లొడగల అప్పారావు, పార్టీ వార్డు అధ్యక్షుడు గుడ్ల పోలిరెడ్డి, నాయకులు ఉప్పులూరి గోపి, లొడగల రామ్మోహన్, అల్లాడ ఉమా మహేశ్వరరావు, మాదు చంటి, బుజ్జి, నొడగల రాంబాబు, అప్పలరాజు, దువ్వి వాసు పాల్గొన్నారు.

## ప్రచార పర్వం



భీమునిపట్నం : జీవీఎంసీ 3వ వార్డులో బ్యాలెట్ నమూనాతో ప్రచారం చేస్తున్న రాంభుక్త ప్రభాకర్ నాయుడు, కొంకి వెంకటేష్, ప్రగడ చంటి, జరజాపు ప్రసాద్, సంతోష్, రాజశేఖర్, కుమార్, గౌరీశంకర్



మధురవాడ : మిథిలాపురి వుడా కాలనీలో ప్రచారం చేస్తున్న ఎంవీ రమణమూర్తి, జ్యోతిర్మయి, కూరాకుల ఆనందప్రసాద్, రాజేష్, దేవి, నిర్మల, పద్మావతి



కొమ్మాది : వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మి విజయాన్ని కాంక్షిస్తూ ఎండాడలోని దుర్గాలమ్మ ఆలయంలో కొబ్బరికాయలు కొడుతున్న కార్పొరేటర్ లొడగల అప్పారావు, అల్లాడ ఉమామహేశ్వరరావు, నాయకులు



పద్మనాభం : మద్ది గ్రామంలో ర్యాలీలో మహిళలు



జీవీఎంసీ 8వ వార్డులో ర్యాలీలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు

## ఆంధ్రా ద్రోహి చంద్రబాబు

తగరపువలస : ఆంధ్రా ద్రోహి చంద్రబాబు అని జీవీఎంసీ భీమిలి జోన్ వైఎస్సార్‌సీపీ నాయకులు విమర్శించారు. శనివారం చిల్లపేటలో పార్టీ జిల్లా యూత్ ప్రెసిడెంట్ బింగి హరికిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వీరు మాట్లాడారు. 2014లో చంద్రబాబు అలవికాని హామీలు ఇచ్చి రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. రియల్ ఎస్టేట్ వ్యాపారం కోసం అమరావతిని సృష్టించారన్నారు. గతంలో భీమిలి నుంచి గెలిచిన గంటా వ్యాపారాల అభివృద్ధికే మంత్రి పదవిని అడ్డం పెట్టుకున్నారన్నారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు రూ.4250 కోట్లతో భీమిలిలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి చేశారన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో వుంటున్న ముత్తంశెట్టి శ్రీనివాసరావు మూడోసారి భీమిలి ఎమ్మెల్యేగా విజయపతాకం ఎగురవేస్తారన్నారు. 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, దల్లి అప్పలరెడ్డి, మునకాల ఆదినారాయణ రెడ్డి, చిల్ల రామసూరి, రౌతు రామిరెడ్డి, డెక్కతి శ్రీను, సరగడ శివ, చిల్ల గోపాల్, సూరిబాబు పాల్గొన్నారు.